క్లుప్తంగా

ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక నందిపైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి స్వామి నేత్రాలయం వైద్యులు డాక్టర్ లక్ష్మయ్య, జనార్దన్‌రెడ్డి, రామ్ రాజ్, సూరజ్ పాల్గొన్నారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్

రుద్రవరం: లబ్ధిదారులకు 1వ తేదీన ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందజేస్తారని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు పింఛన్‌దారుల మ్యాపింగ్ చేశారని వారు ఇళ్ల వద్దకే వెళ్లి పెంచిన పింఛన్, గత మూడు నెలలకు సంబంధించి రూ.3వేలు కలిపి రూ.7వేలు అందజేస్తారని చెప్పారు. అలాగే పింఛన్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేకంగా పర్యవేక్షకులను నియమించారని రుద్రవరం 1,2,3 గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ రామచంద్ర, నర్సాపురం, ఆలమూరు, ముత్తలూరు, చిత్రేనిపల్లె పరిధిలో ఈ ఓపీఆర్డీ, పెద్దకంబలూరు, చిన్నకంబలూరు, ఆర్.నాగులవరం పరిధిలో ఏపీఓ ప్రతాప్,ఎర్రగుడిదిన్నె,పేరూరు,మందలూరు వైపు పీఆర్ఏఈ వెంకటరాముడు, శ్రీరంగాపురం, ఎల్లావత్తుల,కోటకొండ వైపు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ప్రమోద్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

పెద్దమ్మకు విశేష పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యు గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా అధిక శాతం భక్తులు అభిషేక పూజల్లో పాల్గొన్నారు.

లాసెట్ ర్యాంకర్‌కు సన్మానం


హర్షశ్రీని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల ఏపీ లాసెట్ ఫలితాల్లో పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన గురుప్రసాద్ కుమార్తె హర్షశ్రీ రాష్ట్రస్థాయి 9వ ర్యాంకు, తెలంగాణ లా సెట్‌లో 71వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఆదివారం ఆమెను ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు కండే శ్యాంసుందర్‌లాల్, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు బింగుమళ్ల శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించి వారికి ఆర్థికంగా సహాయం అందిస్తామన్నారు. సంఘం నాయకులు రామకృష్ణ, సత్యం, కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు.

వ్యర్థాలతో దుర్గంధం


పెద్దకంబలూరులో ఖాళీ స్థలంలో వ్యర్థాలు

రుద్రవరం:మండల ంలోని పెద్దకంబలూరు ఎస్సీ కాలనీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో గ్రామంలోని వ్యర్థాలను పడేస్తున్నారు. వర్షాకాలంలో వ్యర్థాలలో నీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతోంది.ఆ కంపును భరించలేక పోతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఆదివారం ఆ కాలనీ వాసులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కాలనీ పక్కనున్న ఖాళీ స్థలంలో గ్రామంలోని వృథా, వర్షపు నీరు చేరుతుందని, వాటితో పాటు వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోందని, ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు జంతువుల కళేబరాలను కూడా అక్కడే వేస్తుండటంతో మరింత కంపు వస్తోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనలేం..తినలేం!

- మార్కెట్లో దడ పుట్టిస్తున్న నిత్యావసర సరుకుల ధరలు
- భారీగా పెరుగుతున్న పప్పుదినుసుల రేట్లు
- కందిపప్పు కిలో రూ.180 దాటిన వైనం
- మరింత పెరగవచ్చంటున్న మార్కెట్ వర్గాలు
- వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడులు
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు



నంద్యాల(న్యూటౌన్): నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటుతున్నాయి. బియ్యం నుంచి పప్పుదినుసులతో పాటు చివరకు తాళింపు వేసుకోవడానికి వాడే ఆవాలు సైతం ముట్టుకోనట్లు మారాయి. నిత్యం వాడే పప్పుదినుసుల ధరలు మండిపోతున్నాయి. కందిపప్పు ధరలు చుక్కల్ని అంటగా.. శనగపప్పు, మినపప్పు అదే దారిలో పయనిస్తున్నాయి. అన్నీ కలిపి వినియోగదారుడి గూబ గుయ్ మనిస్తున్నాయి. ఎన్నికల సమయంలో కేంద్రం పప్పుల దిగుమతులపై దిగుమతి సుంకం 15 శాతం ఎత్తేసింది. దీంతో ఆ సమయంలో ధరలు కాస్త తగ్గాయి. ఎన్నికలు ముగియగానే ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఏడేళ్ల గరిష్టానికి మార్కెట్లో పప్పుల ధరలు చేరాయి. మరో పది రోజుల్లో కిలో మరో 20 శాతం పెరిగే అవకాశముంది. కందిపప్పు అకోలా కిలో రూ.200కు చేరింది. ప్రస్తుతం శనగపప్పు కిలో రూ.90, మినప పప్పు రూ.130, బియ్యం సోనా మసూరి సాధారణ రకం ప్రారంభం రూ. 60 పలుకుతుండటంతో సామాన్యులు అన్నం తినడానికి కూడా జనం జంకే పరిస్థితి నెలకొంది.

వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి..

2021 నుంచి అపరాల పంటల దిగుబడులు తగ్గాయి. ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో దేశీయ పప్పు ధాన్యాల ఉత్పత్తి క్షీణించింది. 2021లో 27.30 మిలియన్ టన్నుల ఉత్పత్తి కాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో 23.44 మిలియన్ టన్నులకు తగ్గింది. వాతావరణ మార్పులు ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

దిగుమతులపైనే ఆధారం..

జీడిపప్పు మరింత ప్రియం కొన్ని పప్పులను ఇతర దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలి. దిగుమతులు తగ్గించేలా దేశీయ పంటలను ప్రోత్సహించడానికి కేంద్రం దిగుమతి సుంకాలను విధించింది. అయినా వాతావరణ పరిస్థితులు దిగుబడుల్ని దెబ్బతీశాయి.

జీడిపప్పు మరింత ప్రియం..

పప్పుల ధరలతో పాటు జీడిపప్పు ధర కూడా పెరిగింది. కిలో రూ.820 చేరింది. రాష్ట్రంలో, కేరళలో జీడి పంట దెబ్బతింది. టాంజానియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి కూడా జీడిగింజలు దిగుమతి చేసుకునే అవకాశం లేకుండా పోవడంతో జీడిపప్పు ధరకు రెక్కలొచ్చాయి.

కూరగాయలు కొంటే గాయాలే..

పప్పుల ధరలు చూసి కొనలేం.. ఆకు కూరలు, కూరగాయలతో నైనా సరిపెట్టుకుందామంటే చివరకు టమాట కూడా కిలో రూ.70 చేరింది. ఇక క్యారెట్ రూ.80 పలుకుతోంది. ఉల్లి రూ.50, వెల్లుల్లి రూ. 240, మిర్చి, ఆకుకూరలు, అల్లం ధరలు అందనంత ధరకు చేరుకుంటున్నాయి.

ఆయిల్..

ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్ ధరలు మాత్రం కొంత నిలకడగా ఉన్నాయి. గతంలో ఉన్న సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం కొంతమేర తగ్గించడం, పామాయిల్ ఎగుమతులపై ఆంక్షలు ఉండటంతో ధర అదుపులో ఉందని వ్యాపారులు చెబుతున్నారు. పామాయిల్ లీటర్ ధర రూ.86, ఫ్రీడం రూ.110, వేరుశనగ నూనెలో కంపెనీని బట్టి ధర ఉంటోంది.

వంట నూనె లీటర్ ధర ఇలా..

ధర(రూ.లలో)
పామాయిల్ - 86, సన్‌ఫ్లవర్ - ఫ్రీడం - 110
వేరుశనగ నూనె - 180 నుంచి ప్రారంభం
రైస్‌బ్రాన్ ఆయిల్ - 142, కుసుమ నూనె - 200
నువ్వుల నూనె - 490

కూరగాయల రేట్లు..

ఎల్లిపాయలు - 240, ఉల్లిగడ్డలు - 50
మిరప - 70 , టమాట -100
వంకాయ - 40, క్యారెట్ - 80
బీన్స్ - 130, బీట్‌రూట్ - 70

మార్కెట్లో పప్పుల ధరలు..

కందిపప్పు (అకోలా)	180,	మినప పప్పు	130
శనగపప్పు	90,	పెసర పప్పు	130
వేరుశనగ గుళ్లు	120,	శనగలు	80
జీడిపప్పు	820		

ఏం కొనేలా లేవు



కిలో కందిపప్పు రూ.180, కిలో శనగపప్పు రూ.90 ధరలు ఇలా ఉంటే ఏం తింటాం.. ఏం కొంటాం.. పప్పులకు తోడు కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గించడానికి కృషి చేయాలి. లేదంటే పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడతారు. – జ్యోతి గృహిణి, నంద్యాల

సరుకు లేకే ఈ ధరలు



మార్కెట్‌కు అపరాల సరఫరా తగ్గడంతో పప్పుల ధరలు పెరుగుతున్నాయి. ఇతర దేశాల్లో వాతావరణ ప్రభావం దిగుమతులపై పడింది. కేంద్రం ప్రకటించిన ఎంఎస్పీ కంటే ఎక్కువకు పప్పులు కొనుగోలు చేస్తున్నాం. ధరలు మళ్లీ పెరిగే అవకాశాలున్నాయి. – జనార్ధన్‌శెట్టి, అసోసియేషన్ ప్రతినిధి, నంద్యాల

యాప్స్ నిర్వహణ నుంచి తప్పించాలి


మాట్లాడుతున్న విజయరావు

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలలో బోధనకు అడ్డంకిగా మారిన యాప్‌ల నిర్వహణ నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయారావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో ఉన్న 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ఉపాధ్యాయ బదిలీలు మ్యానువల్ పద్ధతిలో నిర్వహించాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని, 12వ పీఆర్‌సీని ప్రకటించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, అంతవరకు మధ్యంతర భృతిని ఇవ్వాలని, రానున్న డీఎస్సీలో అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సుబ్బారాయుడు నాయక్, సురేష్ కుమార్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

నంద్యాల(అర్బన్): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం సాగిస్తామని ఏపీ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ క్వార్టర్స్‌లోని కార్యాలయంలో ఆదివారం సంఘం నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా సమాజానికి రజకులు సేవలందిస్తూ ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్యారంగాల్లో వెనుకబడి దుర్భర జీవితం అనుభవిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో 17రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నారని గుర్తు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, అధ్యక్షులు మద్దయ్య, నాయకులు నాగరాజు, అంజి, శ్రీనివాసులు, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.

శిలా ఫలకాన్ని తొలగించిన దుండగులు



మహానంది: బుక్కాపురం రైస్ మిల్లు వద్ద శ్మశానానికి వెళ్లడానికి సౌకర్యంగా ఉండేందుకు ఆరు నెలల క్రితం రూ. 6లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. అందుకు ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి తొలగించినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో పోటీపడాలని, ఇలాంటి పనులకు పాల్పడటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

శిలా ఫలకాన్ని తొలగించిన దృశ్యం

మాన్యం కౌలుకు వేలం

సాక్షి ఎఫెక్ట్

దొర్నిపాడు: ఎట్టకేలకు దేవదాయశాఖ అధికారులు మాన్యం వేలం పాటకు ముందుకు వచ్చారు. గత నెల 27వ తేదీన 'బీళ్లవుతున్నా పట్టించుకోరా' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఈఓ చంద్రుడు సోమవారం క్రిష్టిపాడులోనున్న శ్రీనాగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి 25.62, శ్రీచెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన 26.42 ఎకరాలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో చాటింపు వేశామని తెలిపారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను రెగ్యులర్ చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు జీతాలు పెంచాలని, పీఎఫ్ బకాయిలతో పాటు చెల్లించాలని, ఈఎస్ఐ, ఫ్యామిలీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, వర్కర్ల సంఖ్య పెంచాలని కోరారు. సంఘం సెక్రటరీ బాలకృష్ణ, శ్రీనివాసులు, తులసమ్మ, శివ, పుల్లయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

కొత్తపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారత అధికారి కె.లక్ష్మీదేవి సూచించారు. ఆదివారం స్థాని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల సంఖ్య, హాజరు, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇచ్చారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


సుబ్బారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆదివారం స్థానిక కేజీఎస్‌ఫంక్షన్ హాల్‌లో మండలంలోని చింతలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుబ్బారెడ్డి విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి నడవడిక నేర్పారని కొనియాడారు. కార్యక్రమంలో హుసేన్ వలి, మాబాషా, చిన్న హుసేన్ వలి, ఆలంసా హనీఫ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హెచ్ఎం చంద్రశేఖరయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సేవలతోనే గుర్తింపు

ఉయ్యాలవాడ : ప్రభుత్వ ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరయ్య పదవీ విరమణ గావించడంతో ఆదివారం పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో సేవలందిస్తూ తల్లిదండ్రుల తరువాత జ్ఞానం అనే వెలుగును ప్రసాదించేది గురువేనని గుర్తు చేశారు. చంద్రశేఖరయ్య, నాగేశ్వర మ్మ దంపతులను ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం శాలువ కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

చిన్నారులకు చిన్న కుర్చీలు

రుద్రవరం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల కోసం గత ప్రభుత్వం రంగు రంగుల చిన్న కుర్చీలను సరఫరా చేసింది. దీంతో చిన్నారులు సంతోషంగా ఆ కుర్చీలపై కూర్చుంటూ ఆడుకుంటున్నారు. గత ప్రభుత్వం నాడు–నేడు కింద మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సొంత భవనాలు లేని గ్రామాలను ఎంపిక చేసి ఏడు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేసింది. ఒక్కో భవనానికి రూ.13 లక్షల చొప్పున మంజూరు చేయడంతో పాటు ఆ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన వస్తు సామగ్రిని కూడా సరఫరా చేసింది. ఇందులో భాగంగా చిన్నారులకు చిన్న కుర్చీలతో పాటు రౌండ్ టేబుల్, ప్రత్యేక ఆట వస్తువులను అందజేసింది. ముత్తలూరులో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన కుర్చీలు, వస్తు సామగ్రిని సిబ్బంది వినియోగంలోకి తీసుకువచ్చారు.


ముత్తలూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న కుర్చీలపై కూరున్న చిన్నారులు

మూలమఠం.. చారిత్రక ఆరామం

- చాళుక్య భీమునిచే ఆలయ నిర్మాణం
- కార్తీక మాసంలో వన భోజనాలకు ప్రత్యేకం
- భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్న కోవెల


భీమలింగేశ్వరస్వామి ఆలయం

నంద్యాల(అర్బన్): చరిత్ర గతిలో సత్రాలు, మఠాలు సామాజిక వ్యవస్థ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయి. ప్రజాస్వామ్యానికి పూర్వం రాచరిక వ్యవస్థలో వేలాది సంవత్సరాలుగా అవి సేవలు అందిస్తున్నాయి. సనాతన హైందవ సంప్రదాయంలో అతిథి దేవోభవ అంటూ ఆదరించిన వ్యవస్థీకృత పుణ్య కార్యానికి చెరగని సాక్ష్యాలుగా నేటికి విరాజిల్లుతూ సామాజిక బాధ్యతను గుర్తుకు తెస్తున్నాయి. అలాంటి వాటిలో నంద్యాల పరిసర ప్రాంతాల్లో కొలువైన మూలమఠం ఆరామం.

చాళుక్య భీమునితో శివాలయ నిర్మాణం..

పురావస్తు శైవ క్షేత్రమైన శ్రీశైలాన్ని దర్శించుకునేందుకు కాలినడకన వెళ్లే యాత్రికులు విశ్రాంతి తీసుకొనే ఆరామ ప్రదేశంగా మూలమఠం వాడుకలోకి వచ్చింది. ఇది నంద్యాలకు 2కి.మీ దూరంలో ఉంది. పూర్వం ఇక్కడ ఉన్న శివాలయాన్ని చాళుక్య భీముడు కట్టించారని ప్రతీతి. నందరాజులకంటే ముందే క్రీ.శ. 2వ శతాబ్దంలో చాళుక్య భీముడు అనే రాజు పరిపాలన సాగించాడని చరిత్రకారుల సమాచారం. శ్రీకృష్ణదేవరాయుల వారి కాలంలో నంద్యాల చెరువు నిర్మితమవుతున్నప్పటికే మూలమఠానికి విశేష ఆదరణ ఉంది. భీమేశ్వరస్వామి ఇక్కడి మూలవిరాట్. దేవాలయం దేవదాయ, ధర్మాదాయశాఖ పరిధిలో చేరడంతో నిత్య పూజలతో స్వామి, అమ్మవార్లకు పూజలందుతున్నాయి. ఆధ్యాత్మిక పూర్వ వైభవానికి నిదర్శనంగా పెద్దకొనేరు, చేదుబావి, ఆలయ పరిసరాల్లో దేవత మూర్తులు, శిల్ప ప్రతిమలు దర్శనమిస్తాయి. ఇక్కడి రమణీయ ప్రకృతి సంపద, ఆకుపచ్చని అహ్లాదకర వాతావరణం ఆధ్యాత్మికతను పెంపొందింపజేస్తుంది. కార్తీక మాసంలో వనభోజనాలతో ఈ ప్రాంతం భక్తుల రద్దీతో ఉంటుంది.

ఆలయ విశేషాలు..

- ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు, ఆంజనేయ స్వామి, క్షేత్రపాలకుడు వీరభద్రుడు వివిధ ప్రతిమలతో అలనాటి శిల్ప సంపద పూర్వ వైభవానికి అద్దం పడుతుంది.
- హిందూ సంస్కృతిలో తీర్థస్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్నానానికి అనుకూలంగా పూర్వ కాలం నాటి కోనేరు నేటికీ నీటితో నిండుగా ఉంది.
- వందల ఏళ్ల నాటి చేదుబావి ఇప్పటికీ వినియోగించుకునేలా చెక్కు చెదరక నీటితో పదిలంగా ఉంది.
- రూ.70లక్షలతో ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించారు.


ఆనవాలుగా నిలిచిన చేదుడు బావి


ఆలయ ప్రాంగణంలో కోనేరు


కల్యాణమండపం

ఘనంగా మేకలదాదా ఉరుసు


మేకలదాదా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం మేకలదాదా ఉరుసు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా జూన్ చివరి వారంలో మేకల దాదా ఉరుసు జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకలను తిలకించేందుకు సమీప గ్రామాలైన ప్రాతకోట, మండ్లెం, భాస్కరాపురం, రైతుపల్లె, ఎం.ఎన్. ఘణపురం, పగిడ్యాల, సంకిరేణిపల్లె తదితర గ్రామాల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే వేడుకలను ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదా సమాధికి గంధం ఎక్కించి రేయింబవళ్లు ఖవాలి గీతాలు ఆలపించారు. ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

6న నృసింహ యాగ మహోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కాలనీలో వెలసిన శ్రీసీతారామ లక్ష్మణ సమేత త్యాగరాజస్వామి దేవస్థానంలో ఈనెల 6వ తేదీన మహాసుదర్శన నృసింహ యాగ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఊడుమాల్పురం మల్లుగాళ్ల సుబ్బరాయుడు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు యాగం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.